

నిట్‌లో సందడి చేస్తున్న విద్యార్థులు

# నిట్‌లో ఉత్సాహంగా సాంకేతిక సంబురం

- టెక్నోజియాన్-24కు 6 వేల మంది విద్యార్థులు
- జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించిన సీఎస్ఆర్ ఐఐసీటీ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్వీ చౌదరి
- నేటి నుంచి ఈవెంట్ల ప్రదర్శన



టెక్నోజియాన్-24 ప్రారంభించిన మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ ఎన్వీ చౌదరి

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 8: వరంగల్ నిట్‌లో సాంకేతిక సంబురం ఉత్సాహంగా ప్రారంభమైంది. మూడు రోజుల టెక్నోజియాన్-24 ఉత్సవాలకు దేశంలోని వివిధ ఇంజినీరింగ్ కాలేజీల నుంచి సుమారు వేయి మంది, నిట్‌లోని ఐదు వేల మంది విద్యార్థులతో సందడిగా మారింది. శుక్రవారం సాయంత్రం అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో హైదరాబాద్ సీఎస్ఐఆర్ ఐఐసీటీ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్వీ చౌదరి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞానాన్ని, నెట్‌వర్క్‌ను పరస్పరం మార్పిడి చేసుకోవడా నికి ఇలాంటి సాంకేతిక కార్యక్రమాలు గొప్ప వేదిక అని అన్నారు. టెక్నోజియాన్ నుంచి అను భవాలు వారిని డొమైన్‌లో మరింత బలపరుస్తాయని, వారి కెరీర్ అవకాశాలను మెరుగుపరచడంలో సహాయపడతాయని ఆయన ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి దీన్ని ఒక లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్‌గా తీసుకోవాలని, ఈవెంట్లలో పాల్గొని దేశంలోని సమస్యలకు పరిష్కారాలను అందించా ల్సిన అవసరం ఉందని డాక్టర్ చౌదరి అన్నారు. టెక్నికల్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ హరి ప్రసాద్‌రెడ్డి టెక్నోజియాన్ గురించి వివరించారు. రోబోటిక్స్ క్లబ్ నేడు సాయంత్రం 6 గంటలకు ఈవెంట్‌ను నిర్వహిస్తోంది. ఇందులో 100 మందికిపైగా పాల్గొంటున్నారు. సవాలుగా ఉన్న ఇంజినీరింగ్ సమస్యలను పరిష్కరించేందుకు విద్యార్థుల కోసం 48 గంటల హ్యాకథాన్ నిర్వహిస్తున్నట్లు స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డీ శ్రీనివాసాచార్య తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సమన్వయకర్త శ్రీ ఇషాన్, డాక్టర్ బీ శీనివాస్, డాక్టర్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఈవెంట్ల ప్రదర్శన

టెక్నోజియాన్‌లో భాగంగా నేటి నుంచి రెండురోజుల పాటు 50 కంటే ఎక్కువ ఈవెంట్లు ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డేటా సైన్స్ క్వెస్ట్, ఫొటోగ్రఫీ క్లబ్ రీక్రియేటింగ్ ది మూమెంట్, క్విజ్ క్లబ్ సికాడా, కేబీసీ, తదితర ఈవెంట్లను ప్రదర్శించనున్నారు.

# లక్నవరంలో జిప్‌లైన్

త్వరలో 183 మీటర్ల పొడవుతో ఏర్పాటు



లక్నవరంలో జిప్‌లైన్ చేస్తున్న పర్యాటకుడు

గోవిందరావుపేట, నవంబర్8: పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతున్న లక్నవరం సరస్సు వద్ద మరో నూతన అడ్వెంచర్ ప్రారంభం కానున్నది. ఫ్రీకోర్స్ ఆధ్వర్యంలో ఇప్పటికే 3వ ఐలాండ్‌లో నూతన హంగులతో కాటేజీలు ప్రారంభం కాగా, వారి ఆధ్వర్యంలోనే వాటర్ రోలర్, కాయకింగ్ బోట్స్, హంస బోట్‌లు ప్రారంభమయ్యాయి. పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని అందించేందుకు మొదటి వేలాడే వంతెన నుంచి కాకరకాయ బోట్ వరకు జిప్‌లైన్ సౌకర్యం కల్పిస్తున్నారు. 183 మీటర్ల పొడవు జిప్‌లైన్ ద్వారా నీటిపై తేలాడినట్లుగా వెళ్తూ పర్యాటకులను ఎంతగానో ఆహ్లాదపర్చనున్నది. ఒక్కొక్కరికి రూ.300 చార్జీలు వసూలు చేయనున్నట్లు తెలిసింది.



లింగాలఘనపురంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం

# సీసీఐ తీరు.. పత్తి రైతు కన్నీరు

దళారులతో కుమ్మక్కై పక్కపక్కనే కొనుగోళ్లు

**సీసీఐ తీరుతో పత్తి రైతు కన్నీరు పెడుతున్నాడు. ఆరుగాలం కష్టపడి పండించిన దూదిని అమ్ముకుందామంటే తేమ పేరుతో తిరస్కరిస్తుండడంతో విధిలేక అడిగిన కాడికి ప్రైవేట్ వ్యాపా రులకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. జనగామ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని ప్రైవేట్ మిల్లుల్లోనే ఓ వైపు సీసీఐ, మరోవైపు దళారులు పత్తిని కొనుగోలు చేస్తున్నారు. తేమ సాకుతో సీసీఐ కొనకపోవడంతో రైతులు పత్తిని వేరేచోటకు తరలించడానికి వాహన కిరాయి భారమని భావించి అనివార్యంగా పక్కనే ఉన్న ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తున్నది. అక్కడ రిమోట్‌తో తెలివిగా తూకంలో మోసం చేస్తున్నారు. అనంతరం అదే పత్తిని సీసీఐకి విక్రయి స్తున్నారు. అదేవిధంగా 2 శాతం కమీషన్ సహా అన్‌లోడింగ్ చార్జీల పేరుతో మిల్లుల నిర్వాహ కులు, ప్రైవేట్ వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా మారి దోపిడీకి పాల్పడుతున్నారు.**

**- జనగామ, నవంబర్8(నమస్తే తెలంగాణ)**

- తేమ పేరుతో తిరస్కరిస్తున్న వైనం
- విధి లేక ప్రైవేట్ వ్యాపారులకు పత్తి విక్రయం
- ధరలో దగా.. తూకంలో మోసం
- మిల్లు యజమానులతో సిండికేట్‌గా మారి దోపిడీ



లింగాలఘనపురంలో ప్రైవేట్ వ్యాపారుల పత్తి కొనుగోళ్లు

### తూకంలో మోసం..

ప్రైవేట్ మార్కెట్‌లో పత్తిరైతులు నిలువుదోపిడీకి గురువుతున్నా జిల్లా ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.ఎలక్ట్రానిక్ కాంటాల వినియోగంలో వ్యాపారులు చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. రిమోట్‌ను జేబులో పెట్టుకొని రైతులకు తెలియకుండా తెలివిగా ఒక్కో తూకంలో 5 నుంచి 10కిలోల తక్కువ చూపించి మోసం చేస్తున్నారు. అటు ధరలోనూ ఇటు తూకంలోనూ రైతులను అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. పత్తిలో నాణ్యతా ప్రమాణాలు బాగానే ఉన్నా తేమ యంత్రాల మాయాజాలంతో రైతులను నమ్మించి ధర తక్కువ చేసి అమ్ముకునే పరిస్థితి కల్పిస్తున్నారు. జిల్లా కేంద్రంలో చిల్లర కాంటాల వ్యాపారం జోరుగా సాగుతున్నది. గ్రామాల నుంచి మిల్లులు, ప్రైవేట్ వ్యాపారుల వద్దకు పత్తి తీసుకొచ్చే వాహనాలకు కమీషన్ల ఆశచూపి రైతులకు చెల్లించే ధరను తగ్గిస్తున్నారు.

జనగామ వ్యవసాయ మార్కెట్ మినహా సీసీఐ ప్రారంభించిన పత్తి కొనుగోలు కేంద్రాలన్నీ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని ప్రైవేట్ కాటన్, జిన్నింగ్ మిల్లుల్లో ఏర్పాటు చేశారు. ఒకవైపు సీసీఐ, మరోవైపు ప్రైవేటు కొనుగోళ్లు జరుగు తుండటంతో తేమ వంటి సాకుతో ప్రభుత్వరంగ సంస్థ సీసీఐ తిరస్కరిస్తున్న పత్తిని ప్రైవేట్ వ్యా పారులు కొంటున్నారు. ట్రాక్టర్ లేదా ఆటో, డీసీఎం వాహనం లో రైతులు తెచ్చిన పత్తిని సీసీఐ కేంద్రంలో సిబ్బంది తేమ పరీక్ష చేసి తిరస్కరిస్తుండడంతో రవాణా ఖర్చు (వాహన కిరాయి) భారంగా భావిస్తున్న రైతులు వేరేచోటకు తరలించలేక అనివార్యంగా పక్కనే ఉన్న ప్రైవేట్ వ్యాపారులు అడిగిన ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నారు. ఒకే మిల్లులో ఒకవైపు ప్రైవే ట్ కొనుగోళ్లు జరుగుతుండగా మరోవైపు సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తుండడంతో అక్కడి పర్చేజింగ్ అధికారులు, సిబ్బందితో ప్రైవేట్ వ్యాపారులు కుమ్మక్కై రైతును ముంచుతున్నారు. సీసీఐ తిరస్కరించిన పత్తిని మిల్లుల్లో, బయట చిల్లరకాంటా వ్యాపారులు, దళారులు కొని తిరిగి అదే పత్తిని రైతుల పేరిట సీసీఐకి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో పేరుకే 10 ప్రాంతా ల్లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా.. ఐదారు కేంద్రాల్లో మాత్రమే పూర్తిస్థాయి లో పత్తి కొనుగోళ్లు జరుగుతుండగా, మిగిలిన కేంద్రాల్లో క్వింటాలు పత్తి కూడా కొనుగోలు చేయలేదు. విధిలేని పరిస్థితిలో ప్రైవేట్‌లో దళారులు చెప్పిన ధరకు అమ్ముకొని పంటకు పెట్టిన పెట్టుబడి వెళ్లక అప్పుల ఊబిలో కూరుకుపోయి రైతులు నష్టపోతున్నారు.

### తేమ పేరుతో ధర తగ్గింపు..

కేంద్ర ప్రభుత్వం 8 శాతం తేమ ఉన్న ఏ-గ్రేడ్ పత్తి క్వింటాల్‌కు రూ.7,521, 9 నుంచి 12 శాతం వరకు తేమ ఉంటే ఒక్కో శాతానికి రూ.75 తక్కువగా కొనుగోలు చేయాలని నిర్ణయిం చింది. ధాన్యం మాదిరిగా పత్తి ఆరబెట్టుకునే పరిస్థితి ఉండదు. మార్కెట్‌కు అమ్మకానికి తెస్తే అయితే సీసీఐకి లేదంటే ప్రైవేట్‌కు అమ్ముకొని ఇంటికి పోవాల్సిందే. ఒకసారి ఇంటి నుంచి వాహనంలో తెచ్చిన పత్తిని మళ్లీ తీసుకుపోవాలంటే కిరాయి మీద పడి రవాణా ఖర్చు తడిసి మోపెడవుతుంది. దీంతో తేమ, పత్తి నల్లబారిపోయిందనే సాకుతో ప్రైవేట్ వ్యాపారులు క్వింటా ల్‌కు రూ.1,000 నుంచి రూ.2వేలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.



లింగాలఘనపురం మండలం నెల్లుట్లలోని సత్యసాయి కాటన్ ఇండస్ట్రీస్ ఆవరణలో బారులు తీరిన పత్తి వాహనాలు

# సమాఖ్యలో రూ.30 లక్షల రికవరీ

- భూమి కొనుగోలులో అవకతవకలు
- 'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్

నమస్తే ఎఫెక్ట్

జనగామ చౌరస్తా, నవంబర్ 8: చాకలి ఐలమ్మ జిల్లా సమాఖ్య పేరిట జనగామ మండలంలోని వెంకిర్యాల గ్రామంలో రూ.2.35 కోట్లతో మార్కెట్ రేటు కన్నా అధిక ధరకు కొనుగో లు చేసిన 4 ఎకరాల భూమి విషయంలో నిధుల గోల్‌మాల్ జరిగిందనే విషయాన్ని 'నమస్తే తెలంగాణ' ఇటీవల బహిర్గతపర్చింది. దీనిపై సమగ్ర విచారణ జరిపిన కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా బాధ్యుల నుంచి నిధులు రికవరీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో శుక్రవారం జిల్లా సమాఖ్య బ్యాంకు ఖాతాలో సంబంధిత భూమి విక్రయించిన వ్యక్తితో పాటు బాధ్యులు కలిసి రూ.30 లక్షల నిధులు జమ చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై డీఆర్డీవో వసంతను వివరణ కోరగా జిల్లా సమాఖ్య బ్యాంకు ఖాతాలో నిధులు జమ చేసినట్లు బాధ్యులు సమాచారమందించారు. ఇంకా బ్యాంకు స్టేట్‌మెంట్‌ను పరిశీలించాల్సి ఉంది. వచ్చే మంగళ, బుధవారంలోపు బాధ్యుల నుంచి నిధుల రికవరీ, తప్పు చేసిన వారిపై శాఖాపరంగా తీసుకునే చర్యల వంటి విషయాల్లో పూర్తి క్లారిటీ వచ్చే అవకాశం ఉందన్నారు.

# రేబిస్ వ్యాక్సిన్ వికటించి మహిళ మృతి



గరిసెల రజిత(ఫైల్)

భూపాలపల్లి రూరల్, నవంబర్ 8: రేబిస్ వ్యాక్సిన్ వికటించి భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మంజూర్‌నగర్‌కు చెందిన గరిసెల రజిత(37) మృతి చెందింది. మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రజితకు 20 రోజుల క్రితం కుక్క కరవగా వెంటనే జిల్లా కేంద్రంలోని వంద పడకల దవాఖానకు తీసుకెళ్లారు. నిబంధనలు పాటించకుండా వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో ఫ్రిజ్‌లో పెట్టని రేబిస్ ఇంజక్షన్‌ను వేయడంతో ఆమె శరీరంలోని అవయవాలు పాడయ్యాయి. వెంటనే మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ యశోద దవాఖానకు తర లించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. వంద పడకల దవాఖాన వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతోనే తన భార్య చనిపోయిందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె భర్త కోరారు.



భద్రకాళీ చెరువు మత్తడి వద్ద ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

చెరువు నీటిని దిగువ ప్రాంతానికి వదిలిన అధికారులు

# భద్రకాళీ చెరువు పనుల అడ్డగింత

- గండికొట్టి నీటిని వదలడంపై నిరసన
- రూ. రెండు కోట్ల విలువైన చేపల పరిస్థితి ఏంటని నిలదీత
- అధికారుల హామీతో ఆందోళన విరమణ

వరంగల్, నవంబర్ 8: భద్రకాళీ చెరువు పూడికతీత పనుల్లో భాగంగా నీటిని తొలగించే ప్రక్రియను మత్స్యకారులు అడ్డుకున్నారు. మత్తడి కట్టను గండి కొట్టి నీటిని వదలడంపై ఇరిగేష న్, మత్స్య శాఖ అధికారులతో వాగ్వాదానికి దిగారు. 'చెరువును నమ్ముకొని బతుకుతున్నాం.. మా పొట్టలు కొట్టొద్దు' అంటూ నినాదాలు చేశారు. సుమారు రెండు కోట్ల విలువైన చేపలు చెరువులో ఉన్నాయని, అకస్మాత్తుగా చెరువులోని నీటిని పూర్తిగా తొలగిస్తే వాటి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తాతల కాలం నాటి నుంచి చెరువుపై ఆధారపడి బతుకుతున్న 450 కుటుంబాలు జీవనాధారం కోల్పోతాయని అధికారులకు తెలిపారు. తమకు ఉపాధి అవకాశాలు చూపెట్టిన తర్వాతనే చెరువులోని నీటిని ఖాళీ చేయాలని డిమాండ్ చేశారు.

### మత్స్యకారులతో చర్చలు సఫలం

మత్స్యకార సొసైటీ ప్రతినిధులతో ఇరిగేషన్, మత్స్య శాఖ అధికారులు చర్చలు జరిపారు. చెరువులోని చేపలు బయటికి వెళ్లకుండా తూముల వద్ద జాలీలు ఏర్పాటు చేసేందుకు అధికారులు అంగీకరించారు. 2024-25 సంత్సరానికి చెరువు లీజ్ రుణం మాఫీ కోసం ప్రతిపాదనలు మత్స్య శాఖ డైరెక్టర్‌కు పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది భద్రకాళీ చెరువులో చేపలు పట్టుకొనేందుకు హక్కు పత్రాలు, వచ్చే ఏడాది చెరువు కౌలు భద్రకాళీ మత్స్యకార సొసైటీకి ఇస్తామని చెప్పారు. ఈ ఏడాది భద్రకాళీ చెరువుకు కేటాయించిన 1.90 లక్షల చేప పిల్లలు వేరే చెరువులో వేసుకునేందుకు అధికారులు అనుమతిచ్చారు.

## రేపు ఉమ్మడి జిల్లాస్థాయి చదరంగం ఎంపిక పోటీలు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 8 : తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 10న హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ ఎదురుగా ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానంలో బాలబాలికలకు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-13 చదరంగం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. 1, జనవరి 2011 ఆ తర్వాత జన్మించినవారు ఈ క్రీడా పోటీలకు అర్హులన్నారు. శనివారం రాత్రి 7 వరకు తమ పేర్లు 9059522986 నంబర్‌లో సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు.

## నేడు న్యాయసేవా దినోత్సవం

వరంగల్ లీగల్, నవంబర్ 8 : పేద ప్రజలకు ఉచిత న్యాయంతో పాటు దేశ పౌరులకు న్యాయ విజ్ఞానాన్ని అందిస్తున్న న్యాయసేవా సంస్థ ఆవిర్భావ సదస్సును శనివారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు నిర్మలా గీతాంబ, రమేశ్ తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తులు హాజరు కానున్నారు. గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ నుంచి దివ్యాంగులకు లింబ్స్, వీల్ చైర్లు, క్రచర్స్, హియరింగ్ ఎయిడ్స్ అందిస్తామని తెలిపారు. విజయవంతం చేయాలని వారు కోరారు.




పట్టుకున్న గంజాయి, నిందితులతో పోలీసులు

# 48 కిలోల గంజాయి పట్టివేత

కాశీబుగ్గ, నవంబర్8: వరంగల్ రైల్వే స్టేషన్ పరిధిలో శుక్రవారం సుమారు 48 కిలోల గంజాయిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. పోలీసు అధికారుల ఉత్తర్వుల మేరకు శుక్రవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో రెగ్యులర్ తనిఖీలు నిర్వహించారు. ప్లాట్‌ఫాం 2,3 వైపు రెండు ప్లాస్టిక్ సంచులు, రెండు ప్లాస్టిక్ బుట్టలతో అనుమానాస్పదంగా కన్పించ డంతో తనిఖీలు చేశారు. ఈ క్రమంలో ఒడిశా రాష్ట్రంలోని గంజాం జిల్లా తలపాడు గ్రామానికి చెందిన బాబిత కుమారి పాణిగ్రహి ప్రస్తుతం గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ జిల్లా జగన్నాథపురంలో ఉంటుంది. ఒడిశా రాష్ట్రంలోని గంజాం జిల్లా బ్రహ్మపూర్ దంగపదర్ గ్రామానికి చెందిన సంజుక్త బెహరా వారి వద్ద గల బ్యాగులను తనిఖీలు చేయగా 48కిలోల 24గ్రాముల ఎండు గంజాయి దొరికింది. వీరు ఇచ్చాపురం నుంచి సూరత్‌కు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు, ఈ గంజాయి విలువ రూ.12 లక్షల 600 ఉంటుందని తెలిపారు. ఎస్సై జీ వెంకటేశ్వర్లు పంచనా మా చేసి జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగాసీఐ పీ సురేందర్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐపీఎఫ్ వెంకటేశ్వర్లు, ఆర్పీఎఫ్ సిబ్బంది సారయ్య, గురవయ్య, రాజు, జీఆర్పీ ఎస్సై మోయుద్దీన్, పీ రాజు, ఎం నాగరాజు,కే ప్రశాంతి, సీహెచ్ సుమలత పాల్గొన్నారు.

# 'దళిత బంధు'ను కొనసాగించాలి

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- 50 మంది మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ




కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ చౌరస్తా, నవంబర్ 8 : సమాజంలో అత్యంత పేదరికం అనుభవిస్తున్న దళితులను ఆర్థికంగా అభివృద్ధి చేయడంతో పాటు వారికి గౌరవప్రదమైన హోదా కల్పించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'దళిత బంధు' పథకాన్ని కొనసాగించాలని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ధర్మకంచ అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఎస్సీ కార్పొరేషన్, గీతాచార్య ఫౌండేషన్ సంయుక్తంగా 50 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పల్లా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకునే మరో 10 మంది మహిళలకు తన సొంత ఖర్చులతో కుట్టుమిషన్లు అందజేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, కౌన్సిలర్లు మల్లిగారి చంద్రకళారాజు, వాంకుడోత్ అనిత, బొట్ల శ్రీనివాస్, రాంచందర్, బీఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్, నాయకులు తిప్పారపు విజయ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# ముందుకు సాగని ఎల్ఆర్ఎస్

- కుటుంబ, కుల గణన సర్వేతో బ్రేక్
- పెండింగ్‌లో 90 వేల అర్జీలు
- 2 నెలల్లో 1200 దరఖాస్తుల పరిశీలన
- వాటన్నింటినీ క్లియర్ చేస్తే బల్దియాకు కోట్లాది రూపాయల ఆదాయం



వరంగల్, నవంబర్ 8 : గ్రేటర్ కార్పొరేషన్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ముందుకు సాగడం లేదు. రెండు నెలలుగా సాగుతున్న ప్రక్రియ నత్తనడకన నడుస్తున్నది. బల్దియాకు ఆదాయం తెచ్చిపెట్టే ఎల్ఆర్ఎస్ దరఖాస్తు క్లియరెన్స్‌పై అధికారులు దృష్టి పెట్టడం లేదు. గ్రేటర్ పరిధిలో సుమారు 90 వేల దరఖాస్తులు పెండింగ్ ఉన్నాయి. వాటన్నింటిని క్లియర్ చేస్తే బల్దియాకు పెద్ద మొత్తంలో ఆదాయం వస్తుంది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ప్రారంభమై సుమారు 2 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు లెవల్-2 దశకు చేరిన దరఖాస్తులు కేవలం 1200 మాత్రమే ఉండడం చూస్తే పరిస్థితి ఎలా ఉందో తెలుస్తుంది.

### సర్వేతో నిలిచిన ప్రక్రియ

అసలే అంతంత మాత్రంగా సాగుతున్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియకు కుటుంబ, కుల గణన సర్వే అడ్డంకిగా మారింది. సర్వే విధుల్లో సిబ్బంది వెళ్లడంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించే ప్రక్రియకు బ్రేక్ పడింది. కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్ల వార్డు అధికారులు దరఖాస్తుల పరిశీలన బృందంలో ఉన్నారు. వారంతా ఇప్పుడు కుల గణన సర్వేలో నిమగ్నమై ఉండడంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ఆగిపోయింది. దీనికి తోడు బల్దియా, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. ఒక దరఖాస్తు లెవల్-2కు వెళ్లాలంటే బృందంలో ఉన్న మూడు శాఖల అధికారులు పరిశీలించాలి. ఏ ఒక్కరు జాప్యం చేసినా దరఖాస్తు లెవల్-2 కు వెళ్లకుండా పెండింగ్‌లో ఉంటుంది. ఇలా మూడు శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం ఒక్కరు పరిశీలిస్తే మరొకరు పెండింగ్‌లో ఉంచడంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ముందుకు సాగడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

### ఫీజులు చెల్లించిన వారు వందకు మించలేదు

ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తయి లెవల్-2కు వెళ్లిన 1200 దరఖాస్తుదారుల్లో ఫీజులు చెల్లించిన వారు వంద లోపు ఉన్నారు. ఫీజులు చెల్లిస్తాం..తమ దరఖాస్తులు క్లియర్ చేయండి అంటూ ఫోన్లు చేసినా దరఖాస్తులు పరిశీలించే అధికారులు స్పందించడం లేదని అర్జీదారులు వాపోతున్నారు. బల్దియా కార్యాలయం చుట్టూ తిరిగినా సరైన సమాధానం చెప్పే వారు లేరని అంటున్నారు. హెల్ప్‌డెస్క్‌లో సంప్రదిస్తే అధికారి ఫోన్ నంబర్ ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని వచ్చిన వారు చెబుతున్నారు.